క్లుప్తంగా

1న త్రిశక్తి పీఠంలో హనుమజ్జయంతి వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో జూన్ 1వ తేదీ ఉదయం 8 గంటలకు హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉన్న వీరాంజనేయ స్వామివారిని తమలపాకులతో అలంకరించి ప్రత్యేక ఆకు పూజలు జరుపుతామన్నారు. భక్తులు గోత్రనామాలు నమోదు చేసుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులు పూజా రుసుం రూ.250 చెల్లించాలని కోరారు.

జగద్గురువుల బోధనలు సర్వదా ఆచరణీయం



విజయవాడకల్చరల్: జగద్గురువుల బోధనలు సర్వదా ఆచరణీయమని ఆధ్యాత్మికవేత్త మల్లాది వేంకటరామనాథ శర్మ అన్నారు. సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే హనుమత్ జయంతి ఉత్సవాలు, జగద్గురువు వైభవం ఆధ్యాత్మిక ప్రసంగాలు హనుమత్ దేవాలయంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. రామనాథ శర్మ భారతీ తీర్థ మహాస్వామి వైభవం అంశంగా ప్రసంగించారు. శృంగేరీ పీఠాధిపతిగా భారతీ తీర్థ వేద సంస్కృతికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారతీ తీర్థులు గుంటూరు జిల్లాకు చెందిన వారని చిన్నతనం నుంచే వేదాధ్యయనం చేశారని తెలిపారు. అభినవ విద్యాతీర్థ స్వామివారి అనుగ్రహంతో 1974వ సంవత్సరంలో సన్యాసాశ్రమం స్వీకరించారని 1989లో శృంగేరీ పీఠాధిపత్యం వహించి నాటి నుంచి వేద సంస్కృతికి, ధర్మరక్షణకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక, కళాసంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ కృషిని అభినందించారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. మల్లాది స్వాతి, మల్లీశ్వరి, దుర్గానాగమణి, షబానా, శ్రావణి, ప్రిన్స్ తెలుగు, హిందీ చిత్ర గీతాలతో పాటు లలిత గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఘనంగా సత్కరించారు. గోళ్ల నారాయణ రావు, సింగంశెట్టి చంద్రశేఖర్, మీరాకుమార్, డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పమిడిముక్కల: వీరంకిలాకు కల్యాణ మండపంలో పమిడిముక్కల హైస్కూల్‌కు చెందిన 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 15 సంవత్సరాల కిందట చదువుకున్న విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

మిల్క్ యూనియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఎలకుర్రు(పామర్రు): కృష్ణా మిల్క్‌యూనియన్ అందిస్తున్న సేవలను పశు పోషకులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చెలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలోని పాల సేకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పాల ఉత్పత్తి దారులతో ఆయన మాట్లాడుతూ పశువులకు మినరల్ మిక్చర్ వాడటం వలన కలిగే లాభాలను తెలిపారు. పశుపోషకులకు అందుబాటులో ఉన్న మేలుజాతి పశువుల సెమెన్ వినియోగించి మేలు జాతి సంతతిని పొంద వచ్చన్నారు. పశు సంతతి పెంపొందడం వలన పాల ఉత్పత్తి పెరిగే అవకాశాలున్నాయన్నారు. అనంతరం గ్రామంలో పాల కేంద్రం వద్ద పశువుల వైద్యసేవల నిమిత్తం సుమారు రూ.3 లక్షలతో నిర్మించిన ట్రీవీస్, దానిపై స్లాబ్‌ను నిర్మించిన దాత హరికృష్ణను సన్మానం చేశారు. కార్యక్రమంలో పాల సేకరణ కేంద్ర అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బి.కృష్ణారెడ్డి, పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్‌డీకే గోపీనాథ్ పాల్గొన్నారు.

పల్లెల్లో పేదలకు మెరుగైన వైద్యం

- కంకిపాడు సీహెచ్‌సీలో వైద్యసేవలు భేష్
- అందుబాటులో వైద్య నిపుణులు
- అన్ని రకాల వ్యాధులకు వైద్యం
- గుండె సహా అన్ని వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం

కంకిపాడు: పల్లెల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అధునాతన భవనాలు, వసతులు సమకూరాయి. మందుల కొరత తీరింది. అన్ని విభాగాలకు నిపుణులైన వైద్యులు, సిబ్బంది నియామకంతో వైద్యసేవలు భేష్‌గా అందుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యానికి ఎంతో ప్రాధాన్యం కల్పించటంతో కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం సమర్థంగా అందుతుండటంతో ప్రజలు హర్షిస్తున్నారు.

రూ.4.60 కోట్లతో భవనం.....

ఒకప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో సామాజిక ఆరోగ్య కేంద్రం నడిచేది. గత టీడీపీ ప్రభుత్వంలో వైద్య సేవలను మెరుగుపర్చటానికి కనీసం చర్యలు తీసుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాత అందించిన భూమిలో రూ.4.60 కోట్ల అంచనా వ్యయంతో 30 పడకల ఆసుపత్రి భవనం నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కంకిపాడు సహా కంకిపాడు, పెనమలూరు, గన్నవరం, ఉంగుటూరు మండలాలకు చెందిన 40 గ్రామాల ప్రజలు వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు.

వైద్యులు...సిబ్బంది ఫుల్...

ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేదు. ఇప్పటికే ఆరుగురు నిపుణులైన వైద్యులు జనరల్, జనరల్ సర్జన్, దంత, వివిధ రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. వీరితో పాటుగా ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, నలుగురు పీజీలు అందుబాటులో ఉన్నారు. అన్ని విభాగాల్లోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రతి నిత్యం 250కి పైగా ఓపీ రోగులకు ఎంతో సమర్థవంతంగా వైద్య సేవలను అందిస్తున్నారు. వైద్యులతో పాటుగా క్షేత్రస్థాయి సిబ్బంది 31 మంది విధుల్లో ఉన్నారు. ఆసుపత్రిలో నిత్యం పారిశుద్ధ్యం, సెక్యూరిటీ విధులకు మరో 20 మంది విధులు నిర్వహిస్తున్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు, గుండె వ్యాధి నిర్ధారణ సేవలు అందుతున్నాయి.

స్థానికంగానే వైద్యం...

పరిస్థితి విషమంగా ఉంటే తప్ప అన్ని రకాల వ్యాధులకు, బాధితులకు స్థానికంగానే ఆసుపత్రిలో వైద్య సేవలను అందిస్తున్నారు. 30 పడకలు కూడా అందుబాటులో ఉన్నాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నెల నెలా 16, మైనరు ఆపరేషన్లు 30, మేజరు 10 జరుగుతున్నాయి. ఆపరేషన్ సమయంలో విద్యుత్ ఆటంకాలను అధికమించేందుకు ఇన్వర్టర్లు అందుబాటులో ఉంచారు. దీంతో శస్త్రచికిత్సలు సైతం విజయవంతంగా సాగుతున్నాయి. అత్యవసర, క్లిష్టమైన వైద్య సహాయం కోసం మాత్రం విజయవాడకు తరలిస్తున్నారు. రోగులకు అసౌకర్యం కలగకుండా త్వరితగతిన వైద్యం అందిస్తూ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు.

వైద్యం మెరుగ్గా అందిస్తున్నాం



సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల వ్యాధులకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందించేందుకు ఎంతో సమర్థంగా కృషి చేస్తున్నాం. గుండె వ్యాధి నిర్ధారణతో పాటుగా అనేక వైద్య సేవలు అందిస్తున్నాం. 30 పడకలు కూడా అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సంజయ్, సూపరింటెండెంట్, కంకిపాడు సీహెచ్‌సీ

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



చుట్టు పక్కల 40 గ్రామాలకు కూడలి కంకిపాడు. స్థాయికి తగినట్లుగానే పీహెచ్‌సీ సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయ్యింది. భవనంతో పాటుగా అధునాతన వైద్య విభాగాలు, సేవలు అందుతున్నాయి. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సీహెచ్‌సీలో వైద్య సహాయం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలి. వైద్య సేవలను వినియోగించుకోవాలి.

– మేదండ్రావు కుటుంబరావు, చైర్మన్, కంకిపాడు సీహెచ్‌సీ

బీజేపీ విధానాలతో దేశ సమైక్యతకు ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా

కంకిపాడు: బీజేపీ విధానాలతో దేశ సమైక్యతకు సమగ్రతకు ప్రమాదం పొంచి ఉందని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా అభిప్రాయపడ్డారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటివరకూ ఏ రాష్ట్రంలోనూ స్పష్టమైన మెజారిటీ బీజేపీకి వచ్చే పరిస్థితి కనిపించటం లేదన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటన చేయటం విడ్డూరమన్నారు. సోదర భావంతో జీవిస్తున్న హిందూ, ముస్లింల ఐక్యతకు భంగం వాటిల్లుతుందన్నారు. దేశ సమగ్రతకు ప్రమాదం తెచ్చేలా చేసిన వ్యాఖ్యలను మోడీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు షేక్ మాబిని, రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాబి, కృష్ణాజిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్‌బీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు షేక్ కరిష్మా, విజయవాడ నగర అధ్యక్షురాలు షేక్ అల్లాబి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కానూరు గ్రామానిక చెందిన ముమ్మినేని శ్వేత భర్త ఇద్దరు పిల్లలతో ఉంటుంది. కాగా ఈ నెల 23వ తేదీన ఇంటర్ చదువుతున్న కుమారుడు నాగతేజను పెనమలూరులో ఉంటున్న తన తల్లి మహాలక్ష్మి వద్ద వదిలి వెళ్లింది. అయితే ఇంటర్ బెటర్‌మెంట్ పరీక్ష రాయటానికని బయలుదేరిన నాగతేజ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుమారుడి కోసం తల్లి శ్వేత బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఎస్ఆర్ఆర్‌లో పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 4,001 నుంచి 8 వేల ర్యాంకు అభ్యర్థులకు కౌన్సిలింగ్ జరుగతుందన్నారు. 28వ తేదీ మంగళవారం 17,001 నుంచి 22 వేలు, 29వ తేదీ 33,001 నుంచి 38 వేలు, 30వ తేదీ గురువారం 49,001 నుంచి 54 వేలు, 31వ తేదీ శుక్రవారం 59,001 నుంచి 67 వేలు ర్యాంకు అభ్యర్థులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. అలాగే వచ్చేనెల 1వ తేదీ శనివారం 75,001 నుంచి 83,500, 2వ తేదీ ఆదివారం 92,001 నుంచి లక్ష , 3వ తేదీ సోమవారం లక్షా 8,001 నుంచి లక్షా 16 వేలు ర్యాంకు అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

సర్వరోగాలకు యోగా దివ్యౌషధం

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సర్వ రోగాలకు యోగా దివ్య ఔషధమని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్రతి రోజు కొంత సమయం యోగాకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ సంపత్ కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి శరీరం మనసుల మధ్య సమతౌల్యానికి యోగా ఎంతో దోహద పడుతుందని చెప్పారు. ప్రపంచ మానవాళికి గొప్ప వరం యోగా అని పేర్కొన్నారు. మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్నారులు రోజంతా టీవీ, సెల్ ఫోన్లు చూస్తూ సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు అలసత్వానికి గురవుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు యోగాసనాలు వైపు మక్కువ చూపేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు.

ఏటా 2 వేల మందికిపైగా శిక్షణ

అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ.. 2017వ సంవత్సరం నుంచి తమ అసోసియేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రతి ఏటా 2 వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణను అందిస్తున్నామన్నారు. కార్యదర్శి పి.వి.రమణ మాట్లాడుతూ.. యోగాసనాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఉచిత యోగ శిక్షణ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు ప్రాణాయామం వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. మిరియాల వెంకటేశ్వరరావు, సీహెచ్ అరుణ్ కుమార్, ఎండీ ఇక్బాల్, కోశాధికారి లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ కె.గాంధీ బాబు, కొనకళ్ల రెడ్డమ్మ, పిల్లి ప్రశాంత్ కుమార్ తదితరులున్నారు.

రేపటి నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు

చిట్టినగర్: పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో ఈ నెల 28వ తేదీ నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు. 28వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి హనుమత్ దీక్షలను విరమిస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు స్వామిజీ పేర్కొన్నారు.

చెట్ల కింద చదువులకు స్వస్తి

- నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్లకు మహర్దశ
- ప్రారంభానికి సిద్ధంగా అదనపు తరగతి గదులు





నున్న గ్రామంలోని జెడ్పీ స్కూల్లో నిర్మించిన అదనపు తరగతి గదులు

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విద్యా రంగంలో విశేషంగా సంస్కరణలు అమలుచేశారు. ఫలితంగా పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చెట్ల కింద చదువులకు స్వస్తి చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థను పెంచి పోషించింది. కానీ వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత పరిస్థితిని పూర్తిగా మార్చివేశారు. అధ్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చి దిద్దారు.

నున్న జెడ్పీ హైస్కూల్లో.....

రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్మించిన పది అదనపు తరగతి గదులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. టీడీపీ హయాంలో తరగతి గదులు చాలక విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. చెట్ల కింద చదువులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా తరగతి గదుల సమస్యలున్న పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించింది. మొదటిఫేజ్‌లో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ. 53 లక్షలతో కాలిబాట నిర్మించడంతో పాటు మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుత్ పనులు, గ్రీన్ బోర్డుల ఏర్పాటు లాంటి 9 రకాల పనులు నిర్వహించారు. రెండవ ఫేజ్‌లో విద్యార్థులకు అదనపు తరగతి గదుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో పది తరగతి గదులను నిర్మించింది. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తరగతులను ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. నాడు–నేడులో నిర్మించిన పది తరగతులతో హైస్కూల్లో విద్యార్థులకు తరగతి గదుల సమస్య ఉండబోదని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి చెప్పారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌గా ఏర్పడబోతంది. పాఠశాల పునః ప్రారంభం నుంచి 6వ తరగతిలో చేరే విద్యార్థుల నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం అమల్లోకి వస్తుందని హైస్కూల్ హెచ్ఎం తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెనమలూరులో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఉంగుటూరులో విద్యార్థుల రన్నింగ్ పోటీలు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కంకిపాడు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఆదివారం తెన్నేరు గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌లో శిక్షణ, భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ ఆసక్తి గల రంగాలను ఎంచుకుని ప్రతిభ చాటాలన్నారు. గ్రంథాలయాల్లో లభించే విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిభావంతులు కావాలని సూచించారు.

ఆటల పోటీల్లో శిక్షణ

ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో ఆదివారం ఆటల పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనం, క్యారమ్స్, చదరంగంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రిసోర్సు పర్సన్ యశ్విత చిత్రలేఖనంలో నైపుణ్యతపై అవగాహన కల్పించారు. పోటీలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెనమలూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం చేశారు. అనంతరం విద్యార్థులు మ్యూజికల్ చైర్ ,పలు ఆటల పోటీలు నిర్వహించామని శాఖ గ్రంథాలయ అధికారి హరీషా తెలిపారు. వణుకూరు శాఖ గ్రంథాలయంలో కూడా విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక పఠకం, కథలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వేసి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని శాఖ గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ఉంగుటూరు: మండలంలో ఉంగుటూరు, ఆత్కూరు, తేలప్రోలు, మానికొండ జిల్లా శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలకు పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించడం, ఆటలు, లెమన్ స్పూన్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పిల్లలందరూ వేసవి సెలవులలో విజ్ఞాన శిబిరాలను సద్వినియోగించుకోవాలని కోరారు.

క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు

గన్నవరం రూరల్: విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్ ఏర్పడుతుందని చెప్పారు. విజ్ఞాన శిబిరాల్లో పుస్తకాలు చదవటం, డ్రాయింగ్, క్రీడలు తదితర పోటీలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలోని సృజనాత్మకత వెలికితీయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందని వాటిని బయటకు తెచ్చే కృషిని సమ్మర్ క్యాంపుల ద్వారా గ్రంథాలయాల్లో నిర్వహించటం గొప్ప విషయంగా చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా గ్రంథాలయాలకు పంపటం అభినందనీయమని పేర్కొన్నారు. ఖోఖో పోటీ ల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠకులు, గ్రామ పెద్దలు అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో ఆదివారం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో నీతి కథలు విద్యార్థులచే చెప్పించారు. విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు.

పెనమలూరులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పెనమలూరు పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ రామారావు

పెనమలూరు: రాజకీయ కార్యకలాపాల్లో రౌడీషీటర్లు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటానని సీఐ టీవీవీ రామారావు హెచ్చరించారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ రౌడీషీటర్ల పై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామని తెలిపారు. అయితే కొందరు రౌడీ సీటర్లు వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకోకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేస్తామని చెప్పారు. ఇప్పటికే నగర బహిష్కరణకు సంబంధించి నివేదిక ఉన్నతాధికారులకు పంపామన్నారు. గ్యాంగ్‌వార్‌లో ఉన్న కేటీఎం పండు పై పీడీ యాక్టు పెట్టామని పేర్కొన్నారు. కౌంటింగ్ ముందు రోజుకాని, తరువాత కాని రౌడీషీటర్ల కదలిక కనబడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రౌడీషీటర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మరకత శివలింగానికి ధారాపాత్ర వితరణ



శ్రీభవానీశంకర మరకత శివలింగానికి ధారా పాత్ర అలంకరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోని శ్రీభవానీశంకర మరకత శివలింగానికి దాత ఎస్ఎస్‌వీవీ ప్రసాద్ కేజీ వెండితో తయారు చేయించిన ధారా పాత్రను ఆదివారం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన సాయిబాబావారి మందిరంలో భక్తుల సౌకర్యార్థం శ్రీభవానీశంకర మరకత శివలింగాన్ని ఇటీవల ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. దాతలు, భక్తులు స్వచ్ఛందంగా మరకత శివలింగానికి అవసరమైన ఆభరణాలు అందిస్తుండటం అభినందనీయం అన్నారు. మందిరంలో తాము తలపెట్టిన ప్రతీ కార్యక్రమానికి సహకరిస్తున్న భక్తులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాత ఎస్ఎస్‌వీవీ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీభవానీశంకర మరకత శివలింగానికి ధారా పాత్రను అందజేసే అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందన్నారు. మందిరం అభివృద్ధిలో తాను కూడా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధారా పాత్రను అలంకరించారు. దాతను స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

29న రక్తదాన శిబిరం

గాంధీనగర్: గవర్నర్‌పేటలోని కోశల హోటల్‌లో ఈనెల 29న వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ మేనేజర్ వి.త్రినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం ఆవశ్యకతను తెలియజేయడం, రక్తదానం చేసేలా ప్రేరేపించడం లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సంస్థ తరపున 150 మంది రక్తదానంలో పాల్గొంటారన్నారు.